# అదృష్టం



కొర్కా వెంకట సత్యప్రసాద్

చేతిలున్న వాచీవంక చూశాడు వేణు "అయిదున్నర. అమ్మో! తనొచ్చి అప్పుడే అరగంట యిందే త్వరగా వెళ్ళిపోవాలి. లేకపోతే వాళ్ళకి అనుమానమేస్తుంది' తిరిగి కౌంటర్‌వైపు చూశాడు వేణు అసహనంగా. ప్రొప్రయిటర్ ఎవరితోనో మాట్లాడుతున్నాడు. "ఇదీ సమయం" అనుకొని గబగబా కౌంటర్ దగ్గరికి వచ్చాడు వేణు రూపాయి బిళ్ళ, బిల్లుతీసి, టేబిల్‌మీద పెట్టి, వెంటనే దృష్టిని బయటకి సారించాడు.

ప్రొప్రయిటర్ అవతలి వ్యక్తితో మాట్లాడుతూనే రూపాయిబిళ్ళతీసి లోపల పడేసుకొని, మిగిలిన చిల్లర టేబిల్‌మీద పెట్టాడు. "ఏమంటాడో, ఏమంటాడో"- అని భయపడుతూ ఓరకంట ప్రొప్రయిటర్‌ను గమనిస్తున్న వేణు టేబిల్‌మీది చిల్లర్ని గబుక్కున తీసుకోబోయాడు. కాని అప్పటికే ప్రొప్రయిటర్ కన్ను వేణు ఇచ్చిన రూపాయిమీద పడనే పడింది దాన్ని గల్లా పడేసుకున్నప్పుడే "అంత సంతృప్తికరమైన శబ్దం' అంటే ఖంగు"మని వినిపించలేదతనికి వెంటనే దాన్నితీసి, మేగ్నెట్‌తో పరీక్షచేసి, తన అనుమానం నివృత్తి చేసుకున్నాడు అతనావని చేసే లోపలే అక్కడనుంచి గబా గబా జారుకుందామనుకున్నాడు వేణు కాని మర్యాదకాదని మెల్లిగా బయటకు నడవబోయాడు.

"ఏమండీ' అన్నపిలుపుతో కాళ్ళకు బ్రేకు ఎడింది తలతిప్పి వెనక్కి చూశాడు. "కొంచెం ఆగండి సార్, ఈ రూపాయి ఇంకోటివ్వండి". అన్నాడు ప్రొప్రయిటర్ వేణువంక చూస్తూ. అనుకున్నంతా అయింది. నిరాశ పడిపోయాడు వేణు. కాని,'గంభీరత'ని మొఖంలోకి అరువు తెచ్చుకొని, "ఏమిటండి ... ఏమయిందండి ఆ రూపాయికి?' అనడిగాడు.

"ఇది సత్తురూపాయండి. చెల్లదు" - అని పైకని, వేణుకి వినిపించి వినపించనట్లుగా "మీ లాంటి వాళ్ళే ఇలాచేస్తే ఎలాగండి!" అంటూ గొణుక్కున్నాడు ప్రొప్రయిటర్, కొద్దిగా ఇబ్బందిగా మొఖం పెట్టి.

తల తీసేసినంత పనైంది వేణుకి. గబ గబా డబ్బులిచ్చేసి, బయటకి వచ్చేశాడు మారు మాట్లాడకుండా 'ఇదీ ఆఖరి ప్రయత్నం, దీంట్లో తప్పకుండా గెలుస్తాను' అనుకున్నాడు కాని ఇదికూడా 'ఫెయిల్యూర్ అయింది. వేణుకి కోపం, ఉడుకుమోత్తనం. రెండూ ఒకేసారి కలిగాయి. అయినా కూడా నిగ్రహించుకుని, 'దీని అంతేమిటో చూద్దామనుకున్నాడు' పట్టుదలగా. జేబులో ఇంకా పది పైసలున్నాయి. 'జాగ్రత్తగా వాడుకోవాలి' అని తనకు తానే హెచ్చరించుకున్నాడు.

ఎదురుగా కిళ్ళీ కొట్టొకటి కనిపించింది. అక్కడకు వెళ్ళి. చూసి చూసి ఐదు పైసల వక్కపొడి పొట్లాం కొన్నాడు. అప్పుడే ఆ కొట్టువాడు చిల్లర లెక్కపెట్టుకొని లోపల పడేసుకుంటున్నాడు. రూపాయి బిళ్ళ ఇచ్చాడు వేణు. దాన్ని చూడగానే కనిపెట్టేశాడు సత్తు రూపాయని వెంటనే 'చిల్లర లేదు సార్! ఐదు పైసలుంటే ఇవ్వండి' అన్నాడు.

పాపం! తెల్లగా పాలిపోయింది వేణు ముఖం. 'కుస్తీ పందెంలో తనని ఒక్క దెబ్బతో క్రింద పడేటట్లుచేసి, మళ్ళీ తాను లేవకుండా ఉండటానికి ఇంకొక దెబ్బ వేసినట్లుగా' ఫీలయ్యాడు వేణు. సరే ఏం చేస్తాడు! కర్మ. ఏదైనా అంటే నలుగురిలో నవ్వులపాలవుతాడు. ఆ కొట్టువాడి 'బిజినెస్ సీక్రెట్'ని మెచ్చుకుంటూ అయిదు పైసలు చేతికో పెట్టాడు.

'ఆ సత్తు రూపాయిని ఎలా మార్చటమా?' అని ఆలోచిస్తూ నడుస్తున్నాడు వేణు జేబులో ఇంకా ఐదు పైసలు మాత్రమే ఉన్నాయి. అతని ఆలోచనలకి అంతరాయంగా 'సోడా. సోడా ఆంధ్రా సోడా' అన్న పాట వినిపించింది తలెత్తి చూశాడు. ఎదురుగా పదేళ్ళ కుర్రవాడొకడు సోడా బండిని తొయ్యలేక తోసుకుంటూ వస్తున్నాడు. వాడ్ని చూడగానే 'వీడికంటగడితే ఆ సత్తు రూపాయిని' అన్న ఆలోచన కలిగింది వేణుకి రావడమే ఆలస్యం, పోనూ పోయింది వాడి అమాయక మొఖం, వాడి బీదతనానికి చిహ్నంగానున్న అతుకుల చొక్కా, చిరిగిన నిక్కరు వేణు చేత ఆ 'పని' చేయించడం మాన్పించాయి.

కాని మరెట్లా తన సత్తురూపాయిని వదలించుకొనేది? చూస్తూచూస్తూ ఐదురూపాయలు వదిలించుకున్నాడు దీనికోసరం. పెద్దవాళ్ళకి, పడుచువాళ్ళకి తనసత్తురూపాయిని అంటగట్టలేడు. పైగా ఇంకావాళ్ళచేత అనుమానం పొందుతాడుకూడ. మిగిలిందలా, చిన్నపిల్లలు. ముసిలివాళ్ళనూ. వాళ్ళకైతే తేలికగా మోసగించవచ్చు. ఈరోజుల్లో మెత్తగా వుంటే అందరూ నెత్తిమీద మొత్తుతారు, తను అలాంటివాడు కాబట్టేగా ఆ సత్తురూపాయి నెవరో తనకంటగట్టింది. ఇటువంటి చిన్నవాడ్నికాకపోతే పెద్దవాళ్ళనా తను మోసగించేది. అయినా వీడి తెలివంతో పరీక్షిద్దాం.

ఆలోచించి, ఆలోచించి ఒక నిర్ణయానికి వచ్చాడు వేణు. ఆకుర్రవాడు అక్కడే ఒకచెట్టు క్రింద నిలబడి ఉన్నాడు. చుట్టుపట్ల అంతగా ఎవరూ లేరు. వేణు వాడిదగ్గరకి వెళ్ళాడు. వాడు సోడాల్ని లెక్కబెట్టుకుంటున్నాడులా ఉంది. వేణుని చూడలేదు. వేణుయే అడిగాడు 'చల్లని సోడా ఉందా' అని. వాడు గిరుక్కున వెనక్కితిరిగాడు. వేణుని ఎగాదిగాచూసి 'చల్లని సోడా కాపోతే వేడి సోడా ఎవరు తాగుతారుబాబు' అన్నాడు. 'ఫ్రెష్ లేదు గట్టివాడే' ననుకున్నాడు వేణు.

సోడాత్రాగి. 'చిల్లరుందా?' అని రూపాయి చూపించాడు వేణు. వాడు తలూపి రూపాయి తీసుకున్నాడు. దొంగబంగారాన్ని చూసిన కస్టమ్స్ ఆఫీసర్‌లా వాడు దాన్ని చూడగానే మొఖం చిట్లించాడు, వాడు చేసిన చేష్టలకి వేణుకి నవ్వాలో ఏడవాలో కూడ తెలియలేదు. అరడజనుసార్లు అరచేతికోరుద్దుకొని వాసనచూశాడు, బొమ్మా-బొరుసు వేసినట్లుగా ఓపదిసార్లు పైకి గిర్రున ఎగరేశాడు. వేలుమీద, శబ్దం కోసం, డజనుసార్లు మోగించాడు. అప్పటికీ దాన్ని వదలకుండా దాన్నిటుతిప్పి. అటుతిప్పి. అరగంటసేపు పరీక్షచేస్తున్నాడు. 'వీడ్నే గనక కస్టమ్స్ వరుకుల్ని పట్టుకునే ఆఫీసర్‌గా వేస్తే మనదేశం కొద్దిగానైనా బాగుపడేదిగదా.' - అనుకున్నాడు వేణు మనసులో వాడుచేసే పనులకి కోపం వస్తున్నా.

"ఇలాంటివాడి మీద తాను జాలిపడింది." అని ఆశ్చర్యపోయాడు. ఇంత ఆలస్యం భరించలేనన్నట్లుగా ఏదో అందామని నోరు తెరవబోయాడు. ఇంతలో ఆ సోడా కుర్రవాడే అనేశాడు.

బాబు, ఎక్కడ సంపాయిద్దారేమిటి, సత్తు రూపాయని' వేణు ఉక్రోషం ఆపుకోలేకపోయాడు చిన్న కుర్రవాడుకదా అని దబాయించాడు. 'ఏంట్రా రాస్కెల్, ఏమిటి వాగుతున్నావ్' అన్నాడు కొంచెం కోపంగా. వాడు వెంటనే ప్లేటు ఫిరాయించాడు.

'అదికాదు బాబు ఎవడో టోకరా వేసి మీకు సత్తురూపాయిని అంటగట్టాడు.' 'ఆ! సత్తు రూపాయా!'. ఆశ్చర్యంనటించాడు వేణు. చేసేదేం లేక జేబులో ఉన్న అయిదు పైసలు వాడి మొఖాన కొట్టి, ఓడిపోయిన విలన్‌లా ఇవతలకి వచ్చేశాడు. కాని. వాడు ఇందితోసుకుపోతూ అన్న మాటలు వేణుకి చెళ్ళున చెంప మీద కొట్టినట్లైంది. 'సత్తు రూపాయి మార్చిద్దా మనుకున్నాడు పాపం బాబు, నేనంత వెర్రి వెంగళప్పనా, ఆయన బుట్టలో పడటానికి'

ఛీ ఛీ! పాడు రూపాయి. ఎక్కడ దాపురించిందో శనిలాగా, దీన్ని మార్చటానికి అనవసరంగా అయిదురూపాయలు ఖర్చయ్యాయి, తొంభై అక్షింతలుపడ్డాయి. అసలు దీన్నెవడిచ్చాడో తెలిస్తైనా, తీసుకెళ్ళి వాడి మొఖం మీదనే విసిరి కొడుదును. ఛ ఛ! అంతా నా ఖర్మ కాకపోతే పండగనాడు సర్దాగా గడపాల్సిందిపోయి. అడ్డమైన వాళ్ళచేత తిట్లు తింటున్నానే.

వేణులో కోపం తారా స్థాయి నందుకొంది. దాన్ని చూపించడానికి అక్కడ దగ్గర్లో బిచ్చగాళ్ళు ఎవరూ లేరు. నిజంగా ఆ సమయంలో అక్కడెవరైనా అడుక్కునేవాళ్ళుంటే వాళ్ళడగకుండానే వాళ్ళకా సత్తు రూపాయి దానంచేసి వుండేవాడు వేణు

ఏం చెయ్యడానికి తోచటంలేదతనికి ఆ రూపాయిని ఉంచటమా? పారెయ్యడమా? చూస్తూ అంత విలువైన రూపాయిని పారెయ్యడమెలా? అది సత్తుది కావచ్చు. ఇవాళ కాకపోతే రేపైనా అది మారవచ్చుగదా! కాని ఇది వున్నంత కాలం తనకి శాంతి వుండదు. ఇప్పటికే ఎందరితో తిట్లు చీవాట్లు తినిపించింది. ఇంకా ఉంచే ఇంకెంత డబ్బు ఆముసం అవుతుందో? ఎంత మంది చేత మాటలు పడవలసివస్తుందో! పోతేపోయింది వెధవ ఒక్క రూపాయిగదా! పోసి దీంతో తన సంపదంతా ఏం తరిగిపోదు. అనుకొని కోపంతోటి అసహ్యంతోటి ఆ రుపాయి బిళ్ళను విసిరి కొట్టబోయాడు.

కాని ఇంతలో - "ఒక్క రూపాయి మాత్రమే సార్! టిక్కెట్టు ఒక్క రూపాయి మాత్రమే. గొప్ప లక్కీ ఛాన్స్. ఒక్కరూపాయితో లక్షాధికారులవండి. రండి సార్ రండి. ఒక్క టిక్కెట్టు మాత్రమే ఉంది సార్. త్వరపడండి. ఆలసించిన ఆశాభంగం" - అన్న మాటలు విన్పించాయి.

అంతే తక్కున ఆగిపోయాడు వేణు. ఆ లాటరీ వాడి మాటలు చెవుల్లో గింగురు మంటున్నాయి. "ఒక్క రూపాయితో లక్షాధి కారవవచ్చు. తన దగ్గర ఒక్క రూపాయి ఉంది, ఇది వాడికి అంటగట్టితే...అమ్మో! వాడు దీనిసంగతి కని పెట్టేనని. ఇంకో రూపాయి తెమ్మంటే...తన దగ్గర ఆ సత్తు రూపాయి తప్ప చిల్లకానీ కూడ లేదె ఎలా?... ఈ ఛాన్సు పోతే మళ్ళా రాదు. ఏం చేద్దాం? కొద్దిగా సాహసం చేద్దామా?

ఆలోచిస్తూ అలా రోడ్డు ప్రక్కన ఆగిన వేణు దగ్గరికి ఆ లాటరీవాడె వచ్చాడు.

"ఏం సార్! ఆలోచిస్తున్నారు. ఒక్క రూపాయే కదా సార్! కొనండి సార్! నాదగ్గర కొన్న ప్రతి ఆఖరి టిక్కెట్టుకి ఏదో ఒక బహుమతి వచ్చి తీరుతుంది సార్. ఎప్పుడూ అలా జరుగుతున్నది సార్! ఈసారి మీకు ఫస్టు ప్రయిజు తప్పదు సార్. మూడు రోజులనుంచి తిరుగుతున్నాను సార్, దీన్నెవరూ కొనడం లేదు, లక్ష్మి మిమ్మల్ని వెతుక్కుంటు వచ్చింది సార్, కాదనకండి. తీసుకోండి సార్" టిక్కెట్టు తీసి వేణు కందిస్తూ అన్నాడు లాటరీవాడు.

వేణు కాస్త బెట్టు చేశాడు. 'అబ్బబ్బ! వద్దయ్యా బాబు. నాకే లాటరీ అంటేనే పడదు. కాని, కాని వినుగొచ్చింది. వచ్చేదీలేదు పెట్టేదిలేదు. రూపాయి దండగ... అయినా నాదగ్గర ఒక్కరూపాయ్ ఉంది. అది కాస్త దీనికి తగలేస్తే ఎలా!-పైకలా అన్నా మనసులో మాత్రం 'వీడు కొంపదీసి వెళ్ళిపోతాడా ఏం ఖర్మ? అయ్యయ్యో ఎందుకన్నా నట్లా"-అని కంగారు పడ్డాడు.

కాని ఆ లాటరీవాడు వేణుని వదలకుండా జిడ్డులాపట్టుకున్నాడు. వాడి వాలకం చూసి "వీడు తనకి టోపి వెయ్యటం లేదుకదా! అని అనుమానపడ్డాడు వేణు ఆ లాటరీ టిక్కెట్టు తీసుకొని అంతా పరీక్షించాడు. అది మంచిది, డ్రా ఇంకా నాలుగు రోజులుంది. ఫస్టు ప్రయిజు అయిదు లక్షలు,

ధైర్యాన్ని కాస్త అరువు తెచ్చుకొని ఆ టిక్కెట్టును మడిచి జేబులో పెట్టుకున్నాడు వేణు జేబులోన్ని వెతికి ఆ సత్తు రూపాయిని తీసి, ఇవ్వలేక ఇస్తున్నట్లు వాడిచేతిలో పెట్టు. వాడు దాన్ని చూసె లోపలే వసుగులాంటి నడకలో ప్రక్క సందులోకి దూరిపోయాడు.

* *

ఆదివారం ఉదయం అరుణ అరగంటనుంచి లేపుతున్నా లేవని వేణు 'పేపర్' అన్న కేకకు ఉలిక్కి పడి లేచి వాకిట్లోకి పరిగెత్తాడు. వేంకటేశ్వరస్వామిని వేయిసార్లు తలుచుకుంటూ వణుకుతున్న చేతులతో పేపరును తీసుకొని వాలుకుర్చీలో కూలబడ్డాడు. గుండెను ధైర్యంగా చిక్కబట్టుకొని ప్రతి పేజీని వేయికళ్ళతో పైనుంచి క్రిందవరకు చూస్తున్నాడు.... లాటరీఫలితాలు. మెరుపులా మెరిశాయి అక్షరాలు. కళ్ళు అటువైపుకే పరిగెత్తుతున్నాయి ఆత్రుతగా. మనసువాటికి పగ్గం వేసి ఆపుతున్నది భయంగా. ఫస్టుప్రయిజ్ నంబరు... ఆ! కలా! నిజమా! నమ్మలేనట్లు కళ్ళు నులుముకొని మళ్ళీమళ్ళీ చూశాడు. టిక్కెట్టు తీసుకొచ్చి ప్రక్కనపెట్టి మరీచూసాడు. సందేహం లేదు. ఫస్టుప్రయిజు అయిదులక్షలు తనకేవచ్చాయి, అబ్బా! ఆ సత్తురూపాయి తనకెంత అదృష్టం తెచ్చిపెట్టింది

'అరుణా' అన్న గావుకేకకు కంగారుపడి పరుగెత్తుకొచ్చిన భార్యను ఆనందోత్సాహాలతో గుండెలకు గాఢంగా హత్తుకొని గిరగిర తిప్పేశాడు వేణు. భర్తప్రవర్తనకు కాస్త అయోమయంలో పడినా ఆ గాఢపరిష్వంగంలో మునిగిపోయిన అరుణ భర్తని మరింతగట్టిగా కౌగలించుకొని తన్మయత్వంలో పడిపోయింది ఒక్కనిముషం. 'మనకి లాటరీలో అయిదులక్షలు వచ్చాయి అరూ మన మిప్పుడు లక్షాధికారులం' - అన్న భర్తమాటలు అతిపోశగా ఆమె చెవులకితాకి. ఆమెకు మరింత గిలిగింతలు పెట్టాయి.

★

# చేతిరుమాలు

[49 వ పేజీ తరువాయి]

లక్షలు మాత్రమేనని అంచనా)... మీరొక మంచి విషయం తెలుసుకొంటే ... చాలా ... సంతోషం..." పునర్యాన ధోరణిలో ఆపాడు (అందుకోసం మేం ఎన్ని నష్టాలైనా భరిస్తాం అన్నట్లు) స్టూడెంట్సంతా తలలు వాల్చేశారు,

పాపారావు 'ప్రొఫెసరు గారూ!... అంటూ పాదాల మీద పడ్డాడు.

'బాధపడకోయ్!' అన్నట్లు ఎడంచేత్తో భుజం మీద తట్టి, ఆ చేత్తోనే పైకి లేవదీశాడు చిరునవ్వుతో.

(అన్నింటా మేమున్నామనిపించే విద్యార్థులకు)

★